క్లుప్తంగా

రాజకీయ పార్టీలు నిబంధనలను పాటించాలి

పెనమలూరు: సాధారణ ఎన్నికలకు సంబంధించి అన్ని రాజకీయ పార్టీల నేతలు నియమ నిబంధనలు విధిగా పాటించాలని పెనమలూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి డి.రాజు అన్నారు. పెనమలూరులో తన కార్యాలయంలో సోమవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నేతలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ.. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం రాజకీయ పార్టీలు నియమావళిని పాటించాలని సూచించారు. ఎన్నికల నోటిఫికేషన్‌ను అనుసరించి ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్ ప్రక్రియ ఉంటుందన్నారు. నామినేషన్ సమయంలో ర్యాలీలు నిర్వహించరాదన్నారు. పెనమలూరులోని తన కార్యాలయంలో నామినేషన్లు స్వీకరిస్తామని చెప్పారు. పెనమలూరు అసెంబ్లీకి సంబంధించి ఈవీఎంలు గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో భద్రపరిచామన్నారు. మే 1న తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్ వద్ద రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల రెండో ర్యాండమైజేషన్ చేస్తామన్నారు. మే 2 నుంచి 5వ తేదీ లోపు తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్ వద్ద ఈవీఎంల కమిషన్ చేస్తామని వివరించారు. తహసీల్దార్ ప్రసాద్, వివిధ రాజకీయ పార్టీల నేతలు అన్నే వేణుగోపాలకృష్ణమూర్తి, ఉప్పాడ త్రిమూర్తి, కిలారు వెంకటరత్నం, శుభోశేఖర్ పాల్గొన్నారు.

తాడిగడప మున్సిపాలిటీలో చలివేంద్రాల ఏర్పాటు

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో చలివేంద్రాలు, చలువ పందిళ్లు ఏర్పాటు చేశామని మున్సిపాలిటీ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన సోమవారం వివరాలు తెలుపుతూ మున్సిపాలిటీ పరిధిలోని 38 వార్డుల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అలాగే ముఖ్య ప్రాంతాల్లో మొత్తం ఆరు చలువ పందిళ్లు ఏర్పాటు చేశామని తెలిపారు. వేసవిలో ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండటానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. అవసరమైతే మరిన్ని చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తామన్నారు. కాగా యనమలకుదురులోని భగత్‌సింగ్‌నగర్ ప్రాంతంలో ఉన్న నీటి సమస్యను పరిష్కరించామని కమిషనర్ వెంకటేశ్వరరావు తెలిపారు.

రేషన్ డీలర్ సస్పెన్షన్

పెనమలూరు: వణుకూరులో రేషన్ డీలర్ సంగెపు పిచ్చయ్యను సస్పెన్షన్ చేశామని తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. ఆయన సోమవారం వివరాలు తెలుపుతూ రేషన్ డీలర్ పిచ్చయ్య అధికార వాట్సాప్ గ్రూప్‌లో టీడీపీకి మద్దతుగా పోస్టింగ్ పెట్టారన్నారు. ఇది ఎన్నికల నియమావళికి విరుద్ధమన్నారు. దీనిపై ఫిర్యాదులు రావటంతో విచారణ చేసి నివేదికను జాయింట్ కలెక్టర్‌కు సమర్పించామన్నారు. జేసీ ఉత్తర్వులతో రేషన్ డీలర్‌ను సస్పెన్షన్ చేసినట్లు చెప్పారు.

కేడీసీసీ మేనేజర్‌గా విజయకుమారి



ఉంగుటూరు: ఉంగుటూరు కేడీసీసీ బ్యాంక్ మేనేజర్‌గా పుట్ల విజయకుమారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో గుడివాడ డీసీపీపీ నుంచి బదిలీపై వచ్చారు. ప్రస్తుత మేనేజర్ ఎం.సాంబశివరావు నుంచి బాధ్యతలు తీసుకున్నారు. సాంబశివరావు గుడివాడ బజారు బ్రాంచికి బదిలీ అయ్యారు. కేడీసీసీ బ్యాంకు పరిధిలోని సహకార సంఘాల కార్యదర్శులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు.

పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తులు

పెనమలూరు: ఎన్నికల విధుల్లో ఉండే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తులను సోమవారం రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయంలో అందజేశారు. తహసీల్దార్ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరు నియోజకవర్గంలో ఎన్నికల విధుల్లో మొత్తం 1,247 మంది ఉద్యోగులు పాల్గొంటున్నారు. గతంలో పోస్టు ద్వారా పోస్టల్ బ్యాలెట్‌కు సౌకర్యం ఉండేది. ఎన్నికల కమిషన్ తాజా నిబంధనల ప్రకారం ఎన్నికల విధుల్లో ఉండే ఉద్యోగులు ముందుగా ఫారం 12ను రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో సోమవారం రాత్రిలోపు సమర్పించాలి. అయితే సోమవారం రాత్రి 8 గంటలకు 848 మంది ఉద్యోగులు ఫారం 12 దరఖాస్తు సమర్పించారు. ఫారం 12 దరఖాస్తు ఉద్యోగుల నుంచి అర్ధరాత్రి వరకు అందే అవకాశాలు ఉన్నాయి. ఈ నెల 29వ తేదీ అభ్యర్థుల నామినేషన్ ఉపసంహరణ తరువాత బ్యాలెట్‌లు ఉద్యోగులకు అందజేస్తారు. ఉద్యోగులు బ్యాలెట్‌ను ఫెసిలిటేషన్ సెంటర్లలో అందజేయాలి.

ఆలయంలో ప్రత్యేక పూజలు

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో సోమవారం స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 6 గంటలకు స్వామివార్లకు ఏకరుద్రాభిషేకం, ఏకాదశ రుద్రాభిషేకం, అనంతరం స్వామివార్లకు విశేష అలంకరణ చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకోని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం భజన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి 7 గంటలకు స్వామివారికి ప్రత్యేక హారతులు ఇచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. ఈ నెల 17వ తేదీన శ్రీరామనవమి పండుగ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆలయ ఈవో ఎం.గంగాధరరావు తెలిపారు.



గన్నవరంలో ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్, పక్కన ఎమ్మెల్యే అభ్యర్థి వంశీమోహన్





జననేత... పులకింత

● మేమంతా సిద్ధం బస్సు యాత్రకు బ్రహ్మరథం పట్టిన ప్రజానీకం ● మండుటెండను సైతం లెక్క చేయకుండా అపూర్వ స్వాగతం పలికిన ప్రజలు ● సీఎంపై దాడి నేపథ్యంలో ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ప్ల కార్డుల ప్రదర్శన



గన్నవరం: మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాకతో గన్నవరం నియోజకవర్గం పులకించింది. అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా తమ గుండెల్లో కొలువైన అభిమాన నేతను చూసేందుకు అన్ని వర్గాల ప్రజలు రోడ్ల వెంట బారులు తీరారు. గ్రామాల్లో జగన్ మామకు మద్దతుగా మేము సైతం సిద్ధమంటూ విద్యార్థులు ప్రేమ పూర్వక స్వాగతం పలికారు. విజయవాడలో జరిగిన రాళ్ల దాడి కారణంగా గాయపడిన సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఒక రోజు విరామం తర్వాత సోమవారం బస్సు యాత్రను గన్నవరం నియోజకవర్గంలో పునఃప్రారంభించారు. సీఎం వైఎస్ జగన్ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. తొలుత కేసరపల్లిలోని నైట్ స్టే పాయింట్ నుంచి ఉదయం 10.30 గంటలకు బస్సు యాత్ర ప్రారంభమైంది. స్టే పాయింట్ వద్దకు కేసరపల్లితో పాటు పరిసర గ్రామాల నుంచి తరలివచ్చిన ప్రజలకు అభివాదం చేస్తూ సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముందుకుసాగారు. అనంతరం బస్సుయాత్ర ఎయిర్‌పోర్ట్, దుర్గాపురం మీదుగా గన్నవరం చేరుకుంది.

జనసంద్రమైన గన్నవరం..

నియోజకవర్గ కేంద్రమైన గన్నవరంలో జననేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాకతో వేలాదిగా తరలివచ్చిన ప్రజలతో గన్నవరం పట్టణం జనసంద్రమైంది. స్థానిక చెన్నై- కోల్‌కత్తా జాతీయ రహదారి పూర్తిగా జనంతో కిక్కిరిసిపోయింది. బస్సుపై నుంచి వైఎస్సార్ సీపీ మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు, గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్‌తో కలిసి సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకుసాగారు. స్థానిక కొత్తపేట నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు భారీ జనసమూహంతో బస్సుయాత్ర కొనసాగింది. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన యువత జై జగన్ అంటూ నినదిస్తూ బైక్ ర్యాలీతో బస్సు యాత్రను అనుసరించారు. తమ అభిమాన నేతను చూసేందుకు అవ్వాతాతలు, మహిళలు, రైతులు, కార్మికులు, యువతి, యువకులు, విద్యార్థులు ఆసక్తి కనబరిచారు.



మహిళ ఉత్సాహం

అడుగడుగునా జననీరాజనాలు

అనంతరం బస్సు యాత్ర చిన్నఆవుటపల్లి, పెద్దఅవుటపల్లి, ఆత్కూరు, పొట్టిపాడు, తేలప్రోలు మీదుగా బాపులపాడు మండలంలోకి ప్రవేశించింది. ఆయా గ్రామాల్లో పెద్ద సంఖ్యలో జనం జాతీయ రహదారిపైకి చేరుకుని వైఎస్.జగన్‌కు ఘన స్వాగతం పలికారు. బస్సు నుంచి కిందకు దిగిన సీఎం వైఎస్.జగన్ వీరందరిని ఆప్యాయంగా పలకరించారు. పలువురు సీఎంను కలుసుకుని వైద్య చికిత్సలు, ఇతర సమస్యలు గురించి సీఎంకు అర్జీలను అందజేశారు. వీరిని దగ్గరకు తీసుకుని మాట్లాడిన సీఎం వారి సమస్యలను తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీఎంఓ ప్రతినిధులను ఆదేశించారు. అనంతరం బస్సుయాత్ర అంపాపురం, కోడూరుపాడు, ఉమామహేశ్వరపురం, వీరవల్లి మీదుగా కొనసాగింది. దాదాపు 43 డిగ్రీల ఎండను సైతం లెక్కచేయకుండా వేలాది మంది ప్రజలు దారి పొడవునా సీఎం వైఎస్. జగన్‌కు స్వాగతం పలుకుతూ పూలవర్షం కురిపించారు.

సీఎంను కలిసిన డాక్టర్ దుట్టా

హనుమాన్‌జంక్షన్‌రూరల్: వైఎస్సార్ సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ సీనియర్ నేత డాక్టర్ దుట్టా రామచంద్రరావు సోమవారం కేసరపల్లిలో క్యాంప్ సైట్ వద్ద కలిశారు. ఇటీవల విజయవాడలో జరిగిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రలో అరాచక శక్తుల దాడిలో గాయపడిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ గోసుల శివభరత్‌రెడ్డి ఉన్నారు.

ఆత్మీయ కలయిక



కేసరపల్లిలో సీఎం జగన్‌ను కలిసిన గన్నవరం నేతలు

విద్యార్థుల కేరింతలు..



వీరవల్లి, ఆరుగొలను గ్రామాల్లో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలికేందుకు పెద్ద సంఖ్యలో విద్యార్థులు తరలివచ్చారు. సీఎంను చూడగానే వీరందరూ జగన్ మామ.. జగన్ మామ అంటూ పెద్ద ఎత్తున్న నినాదాలు చేస్తూ కేరింతలు కొట్టారు. విద్యార్థులను గమనించిన సీఎం వైఎస్. జగన్ బస్సు దిగి కిందకు వచ్చి వారిని ఆప్యాయంగా పలకరించారు. కొంత మంది పిల్లలు అయితే విద్యాకానుక కింద ఇచ్చిన బ్యాగులు, పుస్తకాలు చూపిస్తూ సంతోషం వ్యక్తం చేశారు.

గుడివాడ సభకు తరలివెళ్లిన పార్టీ శ్రేణులు



యనమలకుదురు నుంచి సభకు వెళుతున్న పార్టీ నేతలు

పెనమలూరు: గుడివాడలో చేపట్టిన మేమంతా సిద్ధం సభకు మండల పరిధి నుంచి పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు సోమవారం పెద్ద ఎత్తున తరలివెళ్లారు. తాడిగడప మున్సిపాలిటీ పరిధి యనమలకుదురు, కానూరు, పోరంకి, తాడిగడప నుంచి సభకు పార్టీ శ్రేణులు ఉత్సాహంగా వెళ్లారు. యనమలకుదురు నుంచి షేక్ అష్రఫ్, క్రోసూరి నరేష్‌కుమార్, కర్రా ఆదిశేషారావు జెండా ఊపి బస్సును ప్రారంభించారు. కార్యక్రమంలో నాంచారయ్య, కరీం, కత్తెరబాషా, ఇమ్రాన్, కార్యకర్తలు పాల్గొన్నారు. పోరంకి నుంచి అద్దేపల్లి చందు, పచ్చిగోళ్ల నాగరాజు ఆధ్వర్యంలో బస్సులు బయలుదేరగా టిడ్కో డైరెక్టర్ పి.రాఘవరావు, గ్రామ పార్టీ కన్వీనర్ మున్నంగి అర్జునరెడ్డి జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. పెనమలూరు గ్రామం నుంచి కెడీసీసీబీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, గ్రామ సర్పంచ్ లింగాల భాస్కరరావు ఆధ్వర్యంలో నాయకులు సభకు తరలివెళ్లారు. గోసాల, గంగూరు, వణుకూరు నుంచి పార్టీ శ్రేణులు గుడివాడ సభకు వెళ్లారు. మండల పార్టీ కన్వీనర్ సంగెపు శ్రీనివాసరావు, అక్బర్‌బాషా, చక్కా గోపీ పాల్గొన్నారు.

కదలిన రూరల్ మండలం

రామవరప్పాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్రకు వైఎస్సార్ సీపీ గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్, గొల్లపూడి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావుల ఆధ్వర్యంలో మండలంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు. బస్సు యాత్రను అనుసరిస్తూ గుడివాడలోని బహిరంగ సభకు తరలివెళ్లారు.

గన్నవరంరూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి ప్రజలు తరలివెళ్లారు. జననేతపై హత్యాయత్నం దాడి జరిగిన తరువాత ఆయనను చూడాలని మహిళలు, రైతులు వేలాదిగా కదిలారు. గన్నవరం గాంధీబొమ్మసెంటర్‌లో చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో జనసంద్రమైంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. ఆయనకు మద్దతు తెలుపుతూ ఆశీర్వదించారు. ఆ దేవుడి చల్లని దయ ఎల్లప్పుడు ఉండాలని అన్ని వర్గాలు ఆకాంక్షించాయి.

పెనమలూరులో టీడీపీకి షాక్



సీఎం జగన్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన దేవినేని స్మిత, దేవినేని గౌతమ్, ఉక్కు కాకాని మనవడు విజయ్‌కుమార్

కంకిపాడు: పెనమలూరు 'టీడీపీ'కి షాక్ తగిలింది. ఆ పార్టీ కోసం అహర్నిశలు కష్టించి పనిచేసిన చలసాని పండు కుమార్తె, అల్లుడు టీడీపీకి గుడ్‌బై చెప్పారు. నమ్మించి వంచించిన మోసాన్ని తట్టుకోలేక, ప్రజా సంక్షేమానికి పాటుపడుతున్న వైఎస్సార్ సీపీలో చేరారు. టీడీపీ పెనమలూరు మాజీ ఇన్‌చార్జి చలసాని వెంకటేశ్వరరావు(పండు) మరణానంతరం 2014 ఒప్పందంలో ఆ కుటుంబానికి సీటు ఇస్తామని టీడీపీ అధిష్టానం మాట ఇచ్చింది. 2014, 2019లోనూ ఇచ్చిన మాట నెరవేర్చకుండా, పార్టీ అధిష్టానం అడుగడుగునా మోసం, నమ్మించి వంచన చేయటంతో చలసాని పండు వర్గం అధిష్టానంపై అసంతృప్తితో ఉంది. కనీస మర్యాద, కష్టపడి పనిచేసే వారికి విలువలు లేవని స్పష్టం కావటంతో చలసాని పండు కుమార్తె దేవినేని స్మిత, అల్లుడు గౌతమ్ వైఎస్సార్ సీపీలో చేరారు.

పార్టీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర కృష్ణాజిల్లా కేసరపల్లి చేరుకున్న క్రమంలో బస ప్రాంగణంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమక్షంలో వారిరువురూ వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. వీరి చేరికతో నియోజకవర్గంలో ఉన్న చలసాని పండు వర్గం వైఎస్సార్‌సీపీకి చేరువై, పార్టీ మరింత పటిష్టస్థితికి చేరుతుందని రాజకీయవర్గాలు చెబుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ నుంచి ఉక్కు కాకాని, స్వాతంత్ర్య సమరయోధుడు కాకాని వెంకటరత్నం మనవడు కాకాని విజయ్‌కుమార్ సీఎం జగన్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు.



పార్టీలో చేరిన గురివిందపల్లి చిట్టిబాబు మాదిగ, కె.ఉమావల్లియాదవ్

జంక్షన్‌లో జననీరాజనాలు



పెరికీడు వద్ద సీఎం వైఎస్ జగన్ రాక కోసం ఎదురుచూస్తున్న ప్రజాప్రతినిధులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: సీఎం వైఎస్ జగన్ బస్సు యాత్రకు ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. సీఎం, సీఎం, జై జగన్, జోహార్ వైఎస్సార్ నినాదాలతో హోరెత్తించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను చూసేందుకు ఎండలో అధిక సంఖ్యలో ప్రజలు రహదారుల వెంబడి బారులు తీరారు. గ్రామగ్రామాన జననేతకు నీరాజనాలు పలికారు. దీంతో హనుమాన్ జంక్షన్ జామ్ అయ్యింది. బాపులపాడు మండలంలోని ఎ.సీతారామపురం, అంపాపురం, కోడూరుపాడు, వీరవల్లి, పెరికీడు, కానుమోలు, ఆరుగొలను మీదగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సు యాత్ర సాగింది. ప్రతి గ్రామం వద్ద సీఎం వైఎస్ జగన్‌కు ప్రజలు ఎదురేగి సాదర స్వాగతం పలికారు.

పూర్ణకుంభంతో స్వాగతం..

అనంతరం హనుమాన్‌జంక్షన్ బైపాస్ రోడ్డు మీదగా పెరికీడు చేరుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వేలాది మంది నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఏపీ ఆర్టీసీ చైర్మన్ కనుమూరి సుబ్బరాజు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఆవిర్నేని శేషగిరిరావు, క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్‌మూర్తి, పార్టీ జిల్లా కార్యదర్శి వెలగపల్లి ప్రదీప్, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, వైస్ ఎంపీపీ పండు రాణి, సర్పంచ్‌లు నరిపల్లి కమలాబాయి, వల్లపోతు జాన్ ప్రకాష్, పీఏసీఎస్ చైర్మన్లు దయాల విజయనాయుడు, కొల్లి బ్రహ్మారావులు పూర్ణకుంభంతో సీఎం జగన్నాయకి ఎదురేగి సాదర స్వాగతం పలికారు. ఇటీవలే టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన కురుమ సామాజికవర్గానికి చెందిన పెరికీడు మాజీ ఎంపీటీసీ సభ్యుడు చెన్నుబోయిన శివయ్య సీఎం వైఎస్ జగన్‌ను కలిశారు. అనంతరం కానుమోలు వద్ద ఉయ్యూరుకు చెందిన శిరీషా రిహ్యాబిటేషన్ సెంటర్ నిర్వాహకులు, దివ్యాంగులు థాంక్యూ సీఎం అంటూ ప్లకార్డులు పట్టుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు స్వాగతం పలికారు. దీన్ని గుర్తించిన ఆయన కొద్దిసేపు ఆగి ఆ చిన్నారులతో ముచ్చటించారు. ఆరుగొలను వద్ద పీఏసీఎస్ చైర్మన్ మూల్పూరు ప్రభుకాంత్ ఆధ్వర్యంలో క్రేన్ సాయంతో భారీ పూలమాలతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పార్టీ శ్రేణులు సాదర స్వాగతం పలికారు. ఆయనపై పూలవర్షం కురిపించి అభిమానం చాటుకున్నారు.